ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.24.01.25 సమయం.13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రెండు దేశాల్లో ఏడు రోజుల పర్యటన ముగించుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఉదయం హైదరాబాద్ కు చేరుకున్నారు.
2. రాష్ట్ర ప్రభుత్వం ఎల్లుండి నుంచి అమలు చేసే నాలుగు నూతన పథకాల లబ్దిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న గ్రామ సభలు ఈ రోజుతో ముగుస్తాయి.
3. సంక్షేమ పథకాల అమలు విషయంలో ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.
4. కరీంనగర్ పట్టణంలో పర్యటిస్తున్న కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ పలు అభివృద్ధి కార్యక్రమాలను లాంఛనంగా ప్రారంభించారు.

--------

**CM Davos:**

సింగపూర్, స్విట్జర్లాండ్ దేశాల పర్యటనను ముగించుకున్న ముఖ్యమంత్రి **A** రేవంత్ రెడ్డి ఈ ఉదయం రాష్ట్రానికి తిరిగి వచ్చారు. సింగపూర్ పర్యటన తర్వాత స్విట్జర్లాండ్ లోని దావోస్ లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి అక్కడి నుంచి హైదరాబాద్ చేరుకున్నారు. ఈ ఉదయం శంషాబాద్ విమానాశ్రయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంటు, శాసనసభ సభ్యులు, పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులను సాధించుకొచ్చారని వారు హర్షం వ్యక్తం చేశారు. కాగా, దావోస్ లో

జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సుల నేపథ్యంలో లక్షా 78 వేల కోట్ల రూపాయిలపైగా పెట్టుబడులతో 16 ప్రముఖ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు, అవగాహన ఒప్పందాలూ కుదుర్చుకుంది. ముఖ్యంగా పునరుత్పాదక ఇంధనం, సాంకేతిక పరిజ్ఞానం, ఉత్పాదక రంగం, ఆరోగ్య సేవల రంగంలో ఈ పెట్టుబడులు దాదాపు 47 వేల మందికి పైగా ఉద్యోగావకాశాలు వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

**(MSL)**

గ్రామ సభలు

రాష్ట్ర ప్రభుత్వం ఎల్లుండి నుంచి అమలు చేసే నాలుగు నూతన పథకాలకు లబ్దిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న గ్రామ సభలు ఈ రోజుతో ముగుస్తాయి. రాష్ట్ర వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఈ రోజు సభలు నిర్వహిస్తున్నారు. పథకాలకు ఎంపికైన లబ్దిదారుల జాబితాను చదివి వినిపిస్తున్న అధికారులు వాటిపై అభ్యంతరాలను, కొత్త దరఖాస్తులను స్వీకరింస్తున్నారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా నిన్నటి వరకు గ్రామ సభలు 85.96 శాతం పూర్తయ్యాని, 13,861 గ్రామాలు, వార్డులలో గ్రామ సభలు నిర్వహించినట్టు ప్రభుత్వం ప్రకటించింది. మిగిలిగిన గ్రామాల్లో సభలు ఈరోజు పూర్తి కానున్నాయి. కాగా ప్రతినిధులు, ఆయా కార్యకర్తలు గొడవకు దిగడంతో అధికారులు పోలీసులతో భద్రత ఏర్పాటు చేశారు.

(డెస్క్)

నల్లగొండ-గ్రామ సభ

నల్లగొండ జిల్లాలో నిర్వహిస్తున్న గ్రామ, వార్డు సభలకు చివరి రోజు కావడంతో గ్రామస్థులు భారీగా తరలి వచ్చారు. ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు కోసం అర్హులైన వారి జాబితాలను ప్రజలు ఆతృతగా పరిశీలించుకున్నారు. జాబితాలో పేర్లు లేని వారి నుంచి ఆయా గ్రామ, వార్డు ప్రత్యేక అధికారులు మళ్ళీ దరఖాస్తులు స్వీకరించారు.

(పిటిసి, నల్లగొండ జిల్లా)

ఖమ్మం-తుమ్మల

రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు విషయంలో ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. ఈ రోజు ఖమ్మం జిల్లా బల్లేపల్లి గ్రామం నుంచి బాలాపేట రోడ్డు విస్తరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎల్లుండి నుంచి నాలుగు నూతన పథకాల అమలు మొదలవుతుందన్నారు. ఆ తర్వాత కూడా ఈ పథకాలు లబ్దికి దరఖాస్తుల స్వీకరణ, అర్హుల ఎంపిక కొనసాగుతుందని స్పష్టం చేశారు. కాగా, గత ఏడాది వచ్చిన వరదలతో జిల్లాలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని మంత్రి వెల్లడించారు. అలాగే, వచ్చే వర్షాకాలం నాటికి ప్రతీ వీధిలో సీసీ రోడ్లు, అవసరమైన చోట లింక్ రోడ్లు నిర్మించడమే కాకుండా వరదలతో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు.

**(PTC, Khammam)**

కేంద్ర మంత్రి:* సికింద్రాబాద్

నూతన విద్యావిధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి **G** కిషన్ రెడ్డి  అభిప్రాయపడ్డారు. నూతన విద్యా విధానం ప్రాథమిక స్థాయిలోనే వృత్తి విద్యలను నేర్పించేందుకు వెసులుబాటు కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ రోజు సికింద్రాబాద్ లోక్ సభ నియోజకవర్గం పరిధిలోని తులసీరాం నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, అంబర్‌పేట ప్రభుత్వ పోలీస్ బాలుర ఉన్నత పాఠశాలకు ఫర్నిచర్ ను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ఫర్నిచర్, కంప్యూటర్ ల్యాబ్స్, నోట్ బుక్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ లాంటి వసతులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

**(MSL)**

బాలికా దినోత్సవం-సీఎం

ఈ రోజు జాతీయ బాలికా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆడపిల్లలందరికీ శుభాభినందనలు తెలియజేశారు. దేశ భవిష్యత్తు బాలికలపైనే ఆధారపడి ఉందని, బాలికల సాధికారత, సమానత్వ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

(డెస్క్)

మహబూబ్ నగర్ - జాతీయ బాలికల దినోత్సవం

నేటి పోటీ ప్రపంచంలో పురుషులతో సమానంగా స్త్రీలకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నందున విద్యార్థినులు ఉన్నత చదువుల్లో పోటీపడాలని మహబూబ్ నగర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాపి రెడ్డి సూచించారు.జాతీయ బాలికా దినోత్సవాన్ని మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ లైన్స్ ప్రభుత్వ పాఠశాలలో జిల్లా న్యాయ సేవాదికార సంస్థ మహిళా,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాపిరెడ్డి మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో ముందుండేలా తల్లిదండ్రులు వారిని తీర్చిదిద్దాలన్నారు

(Byte: జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాపిరెడ్డి )

(పీటీసీ, Mahabubnagar)

సర్వ భాషా కవి సమ్మేళనం:

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి ఏటా నిర్వహించే జాతీయ సర్వ భాషా కవి సమ్మేళనంలో ఈ ఏడాది జాతీయ తెలుగు కవిగా ప్రముఖ కవి ఏనుగు నరసింహ్ రెడ్డి తన 'ఇంద్ర ధనుస్సులు' కవితను వినిపించారు. జాతీయ సర్వ భాషా కవి సమ్మేళనం వివిధ ప్రాంతీయ భాషా అనువాదాలను దేశవ్యాప్తంగా అన్ని ఆకాశవాణి కేంద్రాలూ రేపు రాత్రి 10 గంటలకు ప్రసారం చేస్తాయని ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం కార్యక్రమ అధిపతి KL శ్రీనివాస్ రెడ్డి తెలియజేశారు.

(ఎంఎస్ఎల్)

కరీంనగర్-ఖట్టర్

కరీంనగర్ పట్టణంలో పర్యటిస్తున్న కేంద్ర పట్టణాభివృద్ధి, , గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్ లో కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్ చేరుకున్న మనోహర్ లాల్ కట్టర్ ను కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఇతర అధికారులు నాయకులు పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. బండి సంజయ్ తో కలిసి నేరుగా కరీంనగర్ ఆర్ అండ్ బి అతిథి గృహానికి చేరుకొన్నారు. అక్కడ పోలీస్ ల గౌరవ వందనం స్వీకరించారు. ఆర్ట్స్ కళాశాల వద్ద మల్టీ పర్పస్ పాఠశాలలో 12.35 కోట్ల రూపాయల వ్యయం తో నిర్మించిన పార్క్ ను, అంబేద్కర్ స్టేడియం వద్ద 22 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ ను కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్ ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాలలో మొట్టమొదటి సారిగా చేపట్టిన 24 గంటల త్రాగునీటి సరఫరా కార్యక్రమంను కూడా కేంద్రం మంత్రి పట్టణంలోని హోసింగ్ బోర్డు లో ప్రారభించారు. 18 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ కార్యక్రమం లో మొదటగా నగరం లోని ఐదు డివిజన్ లకు సంబంధించి 4066 ఇండ్లకు నీటిని సరఫరా చేయనున్నారు. అనంతరం హోసింగ్ బోర్డ్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదికకు చేరుకున్నారు.

(పిటిసి, కరీంనగర్)

**PM** సూర్య ఘర్:

ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం కింద రాష్ట్రంలో చొరవ తీసుకుని, సౌరశక్తి ఉత్పాదనను ప్రోత్సహించిన పలువురిని కేంద్ర ప్రభుత్వం డిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానించింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తో పాటు, వికారాబాద్, నల్లగొండ, నాగర్ కర్నూల్ జిల్లాల్లో కూడా పలువురు ఈ పథకం లబ్ది పొందారు. వీరంతా తమ ఇళ్లపై సౌర విద్యుత్ ఫలకాలు అమర్చుకుని, కేంద్ర ప్రభుత్వం నుంచి 70 నుంచి 80 వేల రూపాయిల రాయితీని పొందారు. స్వయంగా సౌర శక్తి ఉత్పాదన గురించి, వీరి మాటల్లోనే విందాం.

(**Soundbytes -** వరప్రసాద్-సికింద్రాబాద్, రమేశ్ కుమార్ - వికారాబాద్, పద్మావతి – నాగర్ కర్నూల్) (**MSL**)

డిండి ప్రాజెక్టు-మంత్రి వెంకట్ రెడ్డి

డిండి ఎత్తిపోతల ప్రాజెక్టుతో నల్లగొండ జిల్లా సస్యశ్యామలం అవుతుందని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లాలో కరువును శాశ్వతంగా పారద్రోలేందుకు, డిండి 6 వేల 190 కోట్ల రూపాయలు మంజురయ్యాయని అన్నారు. శ్రీశైలం ఎగువ నుంచి నీటిని తెచ్చి డిండి, సింగరాజుపల్లి, ఎర్రవల్లి-గోకారం, గొట్టిముక్కుల, ఇర్విన్, చింతపల్లి, కిష్టరాంపల్లి, శివన్నగూడెం రిజర్వాయర్లను నింపి వచ్చే మూడేళ్ళలో నల్లగొండ జిల్లాలోని ప్రతీ ఎకరాకు సాగునీరు అందిస్తామని ప్రకటించారు. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసి నల్లగొండ జిల్లా నుంచి ఫ్లోరైడ్ ను శాశ్వతంగా నిర్మూలిస్తామని అన్నారు.

(పిటిసి, నల్లగొండ జిల్లా )

ఓటరు దినోత్సవం-సిరిసిల్ల

జాతీయ ఓటరు దినోత్సవాన్ని, రాజన్న సిరిసిల్ల జిల్లాలో రేపు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ తెలిపారు. భారత ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఓటర్ నమోదు పెంపు, ఎథికల్ ఓటింగ్ పై అవగాహన కల్పించేందుకు ప్రతీ ఏటా జనవరి 25న ఓటర్ దినోత్సవంగా వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)

రోడ్డు భద్రత వారోత్సవాలు

మంచిర్యాల జిల్లా భీమారం పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ఈ రోజు రోడ్డు భద్రత, నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ర్యాలీ నిర్వహించారు.

(పిటిసి, మంచిర్యాల జిల్లా)